


తేమ శాతం రాగానే ధాన్యం తూకం వేయాలి : కలెక్టర్

బెజ్జంకి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్ధేశించిన తేమ శాతం రాగానే ధాన్యాన్ని తూకం వేయాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించి వివరాలు అడిగారు. ధాన్యం అన్‌లోడింగ్ మిల్లు కేటాయించలేదని నిర్వాహకులు తెలుపగా కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్లులను కేటాయించే ప్రక్రియను పూర్తి చేయాలని డీసీఎస్‌వోను కలెక్టర్ ఫోన్‌లో ఆదేశించారు.



విద్యార్థులను పంపించకపోవడంతో తెరుచుకోని వేచరేణి ప్రాథమిక పాఠశాల తరగతి గదులు

తెరుచుకోని పాఠశాల

- 'వేచరేణి' ఉపాధ్యాయుల డిప్యూటేషన్‌పై స్థానికుల నిరసన
- రద్దు చేయకుంటే పిల్లలను ప్రైవేటుకు పంపిస్తాం
- విద్యార్థుల తల్లిదండ్రులు

చేర్యాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి):"మెరుగైన విద్య అందిస్తాం.. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి.." అంటేనే మా పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించాం. ఇప్పుడు ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. వారి డిప్యూటేషన్ రద్దు చేయాలి. లేదంటే పిల్లలను ప్రైవేటు స్కూళ్లకు పంపిస్తాం." అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు తేల్చిచెబుతున్నారు. దీంతో చేర్యాల మండలం వేచరేణి ప్రాథమిక పాఠశాల బుధవారం తెరుచుకోలేదు. ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు బదిలీ చేయడాన్ని నిరసిస్తూ స్థానికులు ఈ నిర్ణయం తీసుకున్నారు. "మా టీచర్లు మాకు కావాలని కోరుతూ, తమ పిల్లలను పాఠశాలకు పంపించకుండా విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టడం చర్చనీయాంశమైంది.

వేచరేణిలో జడ్పీఎస్ఎస్, ప్రాథమిక పాఠశాలలున్నాయి. గతంలో ప్రాథమిక పాఠశాలలో కేవలం ముగ్గురే ఉపాధ్యాయులు ఉండేవారు. దీంతో విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉండేది. అయితే, గత ఏడాది పీఎస్‌హెచ్ఎంతో పాటు నలుగురు ఎస్జీటీలను నియమించారు. ఐదుగురు ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని, ఇంగ్లిష్ మీడియంతో మెరుగైన విద్య అందిస్తామని ఉపాధ్యాయులు బడిబాటలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. దీంతో గ్రామస్థులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించగా, విద్యార్థుల సంఖ్య 68కి పెరిగింది. ఇందులో 11 మంది యూకేజీ చదువుతున్నారు. అంతా సాఫీగా జరుగుతోందనుకున్న తరుణంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఫాతిమా, శ్రీనివాస్‌ను వేర్వేరు పాఠశాలలకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. తమ పిల్లలకు సక్రమ బోధన లభించదని భావించిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తంచేశారు. విద్యార్థులను పాఠశాలకు పంపించకుండా, పాఠశాల వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ప్రతీ తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండాల్సిందేనని డిమాండ్ చేశారు. విద్యాశాఖాధికారులు డిప్యూటేషన్ రద్దు చేయాలని, లేనియెడల తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపిస్తామని తేల్చిచెప్పారు. ఈ విషయమై ఎంఈవో రచ్చ కిష్టయ్యకు గ్రామస్థులు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఎంఈవో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.



పాఠశాల ఆవరణలో నిరసన తెలుపుతున్న స్థానికులు

మల్టీ.. పల్టీ..!

అత్యాశకు పోయి జిల్లా ప్రజలు మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థలకు లక్ష్యంగా మారుతున్నారు. ఈజీ మనీ పేరుతో వల వేస్తున్న మోసగాళ్లు... తాజాగా "లైఫ్ ఫైనాన్స్ వర్క్" పేరుతో రూ.35 వేలు చెల్లిస్తే 10 రోజుల తర్వాత వరుసగా 20 రోజుల పాటు రోజుకు రూ5వేల చొప్పున రిటర్న్ ఇస్తామని ప్రచారం చేసి, నిండా ముంచేశారు. కోట్లాది రూపాయలు డిపాజిట్ చేయించుకున్న ఈ బోగస్ సంస్థ, కార్యకలాపాలు ఆపేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈజీమనీకి అలవాటుపడిన వందలాది మంది ప్రజలు ఈ సంస్థ మోసాలకు బలయ్యారు.

సిద్దిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)



- జిల్లాలో మరో మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థ
- రూ.35 వేలు చెల్లిస్తే రోజుకు రూ.5వేలు రిటర్న్‌గా ప్రచారం
- ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ పేరిట తెరమీదకు..
- రూ.కోట్లలో డబ్బులు పెట్టిన జిల్లా వాసులు
- బాధితుల్లో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, రైతులు
- సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ ప్రాంతాల్లో ఆన్‌లైన్ దందా

ఈజీమనీని ఎరగా వేస్తే కోట్లాది రూపాయలు వచ్చిపడతాయని భావించే మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థలకు సిద్దిపేట జిల్లా సేఫ్ జోన్‌గా మారుతోంది. అందుకే ప్రజల బలహీనతలను ఆధారంగా చేసుకొని, జిల్లా నలుమూలలా ఇలాంటి ఆన్‌లైన్ దందాలు ఇంటింటా చేరుతున్నాయి.



ఎల్ఎఫ్ వర్క్ మల్టీలెవల్ కంపెనీ పేరిట ప్రచారంలో ఉన్న వివరాలు

రోజుకు రూ.5వేలు ఇస్తామంటూ...

జిల్లాలోని సిద్దిపేట రూరల్, తొగుట, మిరుదొడ్డి, నారాయణరావుపేట, దౌల్తాబాద్, రాయపోల్, గజ్వేల్, మర్కుక్ మండలాల్లో ఘరానా మోసానికి తెరతీశారు. "లైఫ్ ఫైనాన్స్" పేరిట ఒక యాప్‌ను సృష్టించి, ఏజెంట్లను నియమించుకున్నారు. ఈ ఏజెంట్ల ద్వారా ఈజీమనీని సంపాదించే మార్గాలను పరిచయం చేశారు. ఒక్కసారి రూ.35 వేలు చెల్లిస్తే పది రోజుల తర్వాత వరుసగా 20 రోజులపాటు రోజుకు రూ.5వేల చొప్పున అంటే మొత్తం రూ.లక్ష తిరిగి ఇస్తామని ప్రచారం చేశారు. ఇలా కొంతమందికి డబ్బులు వచ్చినట్లు ప్రచారం జరగడంతో, ఆశకు పోయి ఒక్కొక్కరు నాలుగైదు ఖాతాల ద్వారా రూ.35 వేల చొప్పున చెల్లించారు. ఇప్పటికీ ఆ డబ్బులు తిరిగివస్తాయని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఎలక్ట్రానిక్స్ సంస్థ పేరిట టోకరా

ఓ ప్రముఖ ఎలక్ట్రానిక్స్ సంస్థ పేరిట ఈ బోగస్ దందాను ప్రారంభించి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. ఇందుకుగాను డిపాజిట్ల రూపేణ కూడా డబ్బులు గుంజుతున్నారు. ఇందులో డబ్బులు

మిగతా 10వ పేజీలో

బోర్డు తిప్పేసిన మరికొన్ని సంస్థలు

జిల్లాలో "లైఫ్ ఫైనాన్స్" తరహాలోనే పలు ఆన్‌లైన్ సంస్థలు వేలాది మందిని నమ్మించి డబ్బు గుంజిన సందర్భాలు ఉన్నాయి. అత్యాశకు పోయి అందినకాడికి అప్పులు తెచ్చి ఆయా సంస్థల్లో కట్టి మోసపోయారు.

- కోస్టాట్ యాప్: చేర్యాల మండలంలోని పలు గ్రామాల ప్రజలు రూ. 2కోట్ల పైచిలుకు డబ్బులు పెట్టి మోసపోయారు.
- ఎలక్ట్రిక్ స్కూటర్ చైన్ దందా: సిద్దిపేటలో ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ కంపెనీ పేరిట చైన్ దందా ఆరంభించారు. ఒక వ్యక్తి రూ.25 వేలు చెల్లించి సభ్యుడిగా నమోదు కావాలి. మరో ముగ్గురిని చేర్పిస్తే ఒక స్కూటర్ ఉచితంగా ఇస్తామని, విదేశీయాత్రలు అదనమని చెబుతున్నారు.
- బిట్ కాయిన్: ములుగు మండలంలో బిట్ కాయిన్ పేరిట ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు.
- రియల్ ఎస్టేట్ కంపెనీ: మర్కుక్ మండలంలో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ పేరిట రూ.లక్ష డిపాజిట్ చేస్తే నెలకు రూ30 వేలు కమీషన్ ఇస్తామని లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. ఏడాది అవుతున్నా ఎవరికీ డబ్బులు రాలేదు.
- మహిళలే లక్ష్యంగా: నారాయణరావుపేట మండలంలో మల్టీలెవల్ ఆన్‌లైన్ స్కీములు నడుస్తున్నాయి. మహిళలను ఆకర్షించడానికి ఆ సంఘాల పెద్దలే తమవంతు పాత్ర పోషిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.
- క్యూనెట్ : వర్గల్ మండలంలో క్యూనెట్, యుబిటెక్స్ బిట్ కాయిన్ వంటి సంస్థలు తమ కార్యకలాపాలను రహస్యంగా సాగిస్తున్నట్లు తెలుస్తోంది.

బాణాసంచా విక్రయాలకు

అనుమతి తప్పనిసరి : సీపీ



సిద్దిపేట క్రైం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బాణాసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. రాబోయే దీపావళి పండుగను ప్రజలందరూ సంతోషంగా జరుపుకోవాలని, అయితే వారి భద్రత దృష్టిలో ఉంచుకోవాలని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడరాదన్నారు. కమిషనరేట్ పరిధిలోని పట్టణాలలో, మండల కేంద్రాల్లో, గ్రామాల్లో తాత్కాలికంగా షాపులు ఏర్పాటు చేసుకునే విక్రయదారులు సంబంధిత ఏసీపీల పర్మిషన్ తీసుకోవాలని సూచించారు.

21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సీపీ విజయ్ కుమార్ తెలిపారు. అక్టోబర్ 21 నుండి 24 వరకు పోలీస్ స్టేషన్‌లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, ఆన్‌లైన్‌లో తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషలో వ్యాసరచన పోటీలు, ఈ వారోత్సవాల్లో రక్తదాన శిబిరాలు, పోలీస్ అమరవీరులను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు, వీడియో గ్రాఫర్‌లకు పోటీలు నిర్వహిస్తారు. పోలీసులు చేసిన సేవలు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలి. వీటిని ఈ నెల 28లోపు పెన్ డ్రైవ్‌లో పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని పీఆర్‌వోకు అందించాలి. ఈ నెల 21 నుంచి 31 తేదీ వరకు పబ్లిక్ స్థలాల్లో పోలీస్ అమరవీరుల గురించి తెలుపుతూ పోలీస్ కళా బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రధాన కూడళ్ల వద్ద పోలీస్ అమరవీరుల బ్యానర్లను ఏర్పాటు చేయనున్నట్లు సీపీ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

హుస్నాబాద్/హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చూపాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గం కేంద్రంలో బుధవారం మంత్రి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్ చోరీ ఉద్యమానికి మద్దతుగా హుస్నాబాద్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి ఓట్ చోరీపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో తమకు వ్యతిరేకంగా ఉన్న లక్షల ఓట్లను తొలగించి ఎన్నికల ఫలితాలను తారుమారు చేస్తూ బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదన్నారు. అంతకు ముందు హుస్నాబాద్ బ్లాక్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ పరిశీలకులు జ్యోతి రౌటేల, నజీర్, పీసీసీ అబ్జర్వర్ విజయలక్ష్మి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, మాజీ హౌజ్‌ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మంజులా రెడ్డి, గిరి కొండాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి అయిలయ్య, బంక చందు, దర్శయ్య, చిత్తారి రవీందర్, పద్మ తదితరులున్నారు.

డీసీసీ అధ్యక్షుడి ఎంపికపై అభిప్రాయ సేకరణ

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపికపై ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేల హుస్నాబాద్ బ్లాక్‌లోని ముఖ్య నాయకుల అభిప్రాయాలను తీసుకున్నారు. హుస్నాబాద్ బ్లాక్‌లోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల పార్టీ అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకుల అభిప్రాయాలను ఒక్కొరొక్కరిగా అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోటీపడుతున్న గిరి కొండాల్‌రెడ్డి, తాడూరి శ్రీనివాస్ గౌడ్, బస్వారాజ్ శంకర్, సూర్యవర్మ పేర్ల, దరిపల్లి చంద్రం పేర్లను ఇందులో ప్రస్తావించినట్లు తెలిసింది.

- ఓటు చోరీకి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ : మంత్రి ప్రభాకర్

గురుకుల విద్యార్థి మృతి దురదృష్టకరం

హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో ఈనెల 7న ప్రమాదవశాత్తు ఎనిమిదో తరగతి విద్యార్థి వివేక్ మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన చెందారు. బుధవారం అధికారులతో కలిసి గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి, వివేక్ మృతికి గల కారణాలను ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తోటి విద్యార్థులతో ఆడుకుంటున్న సమయంలో నైలాన్ తాడు మెడకు చుట్టుకుని వివేక్ మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని మంత్రి తెలిపారు. వివేక్ కుటుంబానికి ప్రభుత్వం అందించే సహాయం విషయమై కలెక్టర్‌తో మాట్లాడుతున్నామని చెప్పారు. విద్యార్థి మృతిని రాజకీయం చేయవద్దని, ఇది మంచిది కాదని హితవు పలికారు. పాఠశాలకు సంబంధించిన ఏమైనా ఉన్నాయేమో పరిశీలించాలని ఆర్డీవోను మంత్రి ఆదేశించారు.



హుస్నాబాద్‌లో ఓట్ చోరీ ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

స్వాముల మహా పాదయాత్ర

సిద్దిపేట నుంచి శబరిమలై వరకు స్వాముల మహా పాదయాత్ర బుధవారం వైభవంగా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో సాయంత్రం సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ కడవేరుగు మంజుల జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. విభిన్న వేషధారణలతో కళాకారులు, మంగళ వాయిద్యాలు, డప్పుల మోతలతో, అయ్యప్ప నామస్మరణతో పాదయాత్ర సాగింది. మహా పాదయాత్రలో 120 మంది స్వాములు పాల్గొన్నారు. వీరు 1440 కిలోమీటర్ల ప్రయాణించాలి. నవంబర్ 26న పాదయాత్ర ముగుస్తుంది.

- సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి)



పాదయాత్రలో విభిన్న వేషధారణతో కళాకారులు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

- ఐకేపీ కొనుగోలు కేంద్రం వద్ద ఆధిపత్య పోరు
- 10 నిమిషాల వ్యవధిలో రెండుసార్లు ప్రారంభం
- తొగుటలో ఉద్రిక్తత.. అధికారులకు ఇబ్బందులు

తొగుట, అక్టోబరు 15: దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది. తాజాగా, తొగుట మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం ఈ రాజకీయాలకు వేదికైంది. కేవలం 10 నిమిషాల వ్యవధిలో ఈ కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులు ఒకసారి, దుబ్బాక ఎమ్మెల్యే మరోసారి ప్రారంభించారు. ప్రొటోకాల్ ప్రకారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవానికి రావాలని ప్రజాప్రతినిధులకు అధికారులు సమాచారం అందించారు. 10 గంటల సమయంలో దుబ్బాక ఆత్మకమిటీ చైర్మన్ గాంధారి నరేందర్‌రెడ్డితో పాటు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు మార్కెట్ యార్డుకు చేరుకున్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్ రెడ్డి వస్తున్నట్లు అధికారులకు సమాచారం అందడంతో వారు ఆయన కోసం వేచి ఉన్నారు. అయితే, కాంగ్రెస్ శ్రేణులు కొనుగోలు కేంద్రాన్ని ముందస్తుగా ఆత్మకమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అధికారులు కాంగ్రెస్ నేతల కార్యక్రమంలో పాల్గొనకుండా అక్కడి నుంచి వెళ్లిపోయారు. సరిగ్గా 10 నిమిషాల వ్యవధిలోనే ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి అక్కడికి చేరుకుని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, అధికారులు మరోమారు ఆయన చేత ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభింపజేశారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిరుత చిక్కడానికి ఇంకెన్నాళ్లు?

- దొమ్మట, మాచిన్‌పల్లి అటవీ ప్రాంతాల్లో సంచారం
- పులా? తోడేలా? తేల్చుకోలేకపోతున్న అధికారులు
- పొలం పనులకు వెళ్లాలంటేనే జంకుతున్న రైతులు

దౌల్తాబాద్, అక్టోబరు 15: దౌల్తాబాద్, రాయపోల్ మండలాల శివార్లలో మూడు సంవత్సరాల నుంచి సంచరిస్తున్న చిరుత పులిని ఫారెస్ట్ అధికారులు ఇంతవరకు బంధించలేకపోతున్నారు. చిరుత సంచారంతో ఆయా మండలాల ప్రజలు, రైతులు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం సాయంత్రం దౌల్తాబాద్ మండలంలోని మాచిన్‌పల్లి గ్రామానికి చెందిన రమేష్ అనే యువకుడికి మల్లన్న గుట్టపై చిరుత కనిపించిందని సమాచారం. అంతకు ముందు దొమ్మట అటవీ ప్రాంతంలో కూడా ఆనవాళ్లు కనిపించాయి. ఫారెస్ట్ అధికారులు మాత్రం ఇది చిరుత పులా, తోడేలా, లేక నక్కలా? అని తేల్చుకోలేక పోతున్నారు. మంగళవారం రాత్రి దొమ్మట ఫారెస్ట్‌లో లింగరాజుపల్లి గ్రామంలోని ఓ రైతుకుచెందిన లేగదూడను ఓ జంతువు చంపి తిన్నది. దీనిని చిరుత పులేనని ప్రజలు నమ్మగా, ఫారెస్ట్ అధికారులు మాత్రం అది తోడేలని నిర్ధారించారు. బుధవారం విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షేక్ అమీద్ హుస్సేన్, బీట్ ఆఫీసర్ ఎస్కే జాంగిర్ మాచిన్‌పల్లి ఫారెస్ట్‌లో పులి సంచరించిన మల్లన్న గుట్ట వద్దకు చేరుకున్నారు. వారికి పులి ఆనవాళ్లు కనపడలేదు. చిరుతను గుర్తించడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఎన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా చిరుతపులి చిక్కకపోవడంతో పొలాల వద్దకు వెళ్లాలంటేనే రైతులు భయపడుతున్నారు.



చిరుతపులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వామ్మో... వానరమూక!

- ఇల్లు, వీధి, రోడ్డు.. ఎక్కడ చూసినా కోతుల గుంపు
- ప్రజలు, ప్రయాణికుల బెంబేలు... తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదాలు



కోతులు రాకుండా శ్రీనగర్ కాలనీలో ఓ ఇంటి ప్రహరీపై ఏర్పాటు చేసిన పులి బొమ్మ

చేర్యాల, అక్టోబరు 15 : చేర్యాల మండలంలో కోతుల సంచారం నానాటికీ పెరిగిపోతోంది. ఇల్లు, వీధి, రోడ్డు.. ఇలా ఎక్కడ చూసినా కోతుల గుంపులే దర్శనమిస్తున్నాయి. ఆహారం కోసం ఇళ్లలోకి, భవనాల్లోకి చొరబడుతున్నాయి. దారి వెంట వెళ్తున్నవారిపైకి ఎగబడుతున్నాయి. పదుల సంఖ్యలో కోతులు సంచరిస్తుండటంతో ఇంటి తలుపులు తెరవాలన్నా, ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లాలన్నా ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా, చేర్యాల మున్సిపల్ పరిధిలో కోతుల బెడద మరింత తీవ్రంగా మారింది. వాహనచోదకులు కోతుల గుంపులను చూసి తమ వాహనాలను ఆపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర పరిస్థితులలో కోతుల నుండి తప్పించుకునే ప్రయత్నంలో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. కోతులు ఇంటి పెంకులపై గెంతుతుండటంతో పైకప్పులు ధ్వంసమవుతున్నాయి. కోతులను పట్టి అడవులలో వదిలిపెట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. కొందరు స్వచ్ఛందంగా డబ్బులు భరించి కోతులను పట్టించినప్పటికీ, రెండు రోజులకే మళ్లీ కొత్త గుంపులు వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. కొందరైతే తమ ఇళ్లకు సోలార్ ఫెన్సింగ్‌ను బిగించారు. ఇంకొందరు ప్రహరిపై పులిబొమ్మను ఏర్పాటు చేసుకుంటున్నారు.



చేర్యాల పట్టణంలో ఓ ఇంటిచుట్టూ కోతులమూక



మార్కెట్‌యార్డు ఎదురు వీధిలో కోతులగుంపు

విగ్రహ ఏర్పాటుపై సమసిన వివాదం

● భూమి పూజ చేసిన చోటే ఛత్రపతి శివాజీ విగ్రహం
● గ్రామ సభలో తీర్మానం

కల్హేర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామంలో గత 13 రోజులుగా ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటు గురించి ఇరు వర్గాల మధ్య రగులుచున్న వివాదం ప్రజాభిప్రాయ సేకరణతో సమస్య పరిష్కారమయింది. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ జరిగిన స్థలంలోనే విగ్రహం ఏర్పాటుకు గ్రామ సభ తీర్మాణించడంతో వివాదం సద్దుమణిగింది. గ్రామంలో కల్హేర్-మాసాన్‌పల్లి రహదారి పక్కన వాటర్ ట్యాంకు వద్ద ఇప్పటికే అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేశారు. దీని పక్కనే ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఈ నెల 2న విజయదశమి రోజున గ్రామ శివాజీ యూత్ గ్రామస్తుల సహకారంతో భూమి పూజ చేశారు. దీనిపై స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం బాధ్యులు అభ్యంతరం చెబుతూ ఇప్పటికే అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఉన్నందున విగ్రహానికి ఎడమ పక్కన ఏర్పాటే చేస్తే అంబేడ్కర్ విగ్రహం కనపడకుండా ఉంటుందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహం కనపడకుండా ఏర్పాటే చేయడం లేదని, రెండు విగ్రహాలు సమానంగానే ఉంటాయని ఇందులో ఎలాంటి వివక్ష లేదని మరో వర్గంగా ఉన్న గ్రామస్తులు తెలిపారు. ఇరు వర్గాలు అధికారులు, పోలీసులను ఆశ్రయించారు. వారి సూచన మేరకు గ్రామ సభలో తీర్మానం చేయాలని సూచించడంతో బుధవారం పంచాయితీ ప్రత్యేక అధికారి, నీటి పారుదల శాఖ డీఈఈ జలందర్, కార్యదర్శి రజనీకాంత్ సమక్షంలో గ్రామస్తులందరూ సమావేశమయ్యారు.

పురోగతిలేని జగత్ కిలేడీ కేసు

● ఐజీ స్థాయి అధికారి కుటుంబంతో వ్యాపారాలు
● డీఎస్పీతో కలిసి బాధితులకు బెదిరింపులు

పటాన్‌చెరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చెప్పి విద్య అనే మహిళ రూ.18కోట్లు వసూళ్లు చేసిన కేసు విషయంలో అడుగులు ముందుకు పడటం లేదు. డబ్బులు అడగడానికి వచ్చిన బాధితులపై దాడి చేసిన విషయంలో ఒక్కరిని కూడా అదుపులోకి తీసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. పోలీస్ ఉన్నతస్థాయి అధికారులతో కలిసి వ్యవహారాలు నడిపిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. చిత్తూరు జిల్లాకు చెందిన గతంలో సస్పెండయిన ఓ డీఎస్పీతో కలిసి అమీర్‌పేటలోని హోటల్‌లో ప్రత్యేకంగా సూట్ బుక్ చేసుకున్నట్లుగా బాధితులు చెబుతున్నారు. డీఎస్పీకి చెందిన రివాల్వర్‌ను తీసుకొని విద్య ఫోటోలు దిగింది. దాన్ని సామాజిక మీడియాలో పెట్టారు. వైరల్‌గా మారి చర్చనీయాంశం అయింది. అలానే సూట్‌కు బాధితులను పిలిపించి డీఎస్పీ సమక్షంలో బెదిరింపులకు పాల్పడుతూ మానసిక క్షోభకు గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. సదరు మాజీ ఎమ్మెల్యే కుమారుడు, అక్రమంగా ఇసుకవ్యాపారం చేస్తున్న సోదరుడు ప్రత్యక్షంగా ఆమెతో కలిసి పని చేస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలానే ఐజీ కుటుంబసభ్యులతో వివిధ రకాల వ్యాపారాలు చేస్తున్నామంటూ బాధితులను బెదిరించినట్లు సమాచారం. 22ఏళ్ల వయస్సులో చంద్రగిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. డబ్బులు ఇచ్చిన బాధితులు ఆయా ప్రాంతాల్లోని పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో ఆమెపై కేసులు ఉన్నాయి.

పటాన్‌చెరులో కేసు ఏమైనట్టు

పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో విద్యతో పాటు మరో ఆరుగురుపై ఈనెల 9న హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన విచారణ చేస్తున్నామంటూ పోలీసులు కాలయాపన చేస్తున్నారు. ఇటీవల విద్య బాధితులు సంగారెడ్డి జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తప్పకుండా న్యాయం చేస్తామంటూ బాధితులను పంపించేశారు. ఏడుగురిని పట్టుకోవడానికి రెండు బృందాలు నియమించామని సీఐ వినాయకరెడ్డి చెప్పారు. పటాన్‌చెరు శివారు ఏపీఆర్ గ్రాండ్స్ కాలనీలోని 74 నంబరు విల్లాలో బాధితులపై దాడి చేశారు. ఇందుకు సంబంధించిన ఆమెపై కేసు నమోదయిన మరుక్షణం పరారవడానికి పోలీసులు సహకారించారని బాధితులు చెపుతున్నారు. కాలనీలో ఎక్కడికక్కడ సీసీకెమేరాలు ఉన్నాయని బాధితులు చెప్పారు. తెలంగాణలో ఇద్దరు డీఎస్పీలు సహకారం అందిస్తున్నారంటూ బాధితులు ప్రచారం చేస్తున్నారు. విద్యపై హత్యాయత్నం కేసుతో పాటు చీటింగ్, మోసం, వైట్‌కాలర్ అఫెన్సర్ కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు

అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై ..

చేగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తేలాడు . ఈ సంఘటన చేగుంట మండలం పొలంపల్లి గ్రామంలో శివారులోని పెద్ద చెరువులో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎరుకల ప్రవీణ్ (30) ఈనెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఈనెల 14న ఫిర్యాదు చేశారు. బుధవారం ఉదయం గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో ప్రవీణ్‌గా గుర్తించారు. చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు

మంజీరలో మునిగి రైతు మృతి

పాపన్నపేట అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మంజీర నదిలో విద్యుత్ మోటర్ తీసేందుకు వెళ్లి నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుర్తివాడలో బుధవారం వెలుగు చూసింది. పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హబీద్ (53) వ్యవసాయంతో పాటు, ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మంజీర నది దగ్గర ఉన్న తన పొలానికి, విద్యుత్ మోటర్ పైప్ లైన్ ఊడి పోవడంతో దాన్ని బిగించేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. ఈ క్రమంలో నీట మునిగి గల్లంతయ్యాడు. బుధవారం ఉదయం అతడి శవం దొరికింది.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన కారు

కొండపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో యువతి మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి వద్ద చోటు చేసుకుంది. తిమ్మరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాశనగర్‌కు చెందిన మహమ్మద్ అసిఫా (23), మహమ్మద్ గోరెమియా(60) రేషన్ బియ్యం తీసుకురావడాని బైకుపై తిమ్మారెడ్డిపల్లి గ్రామంలోకి వెళ్లడం కోసం యూటర్న్ తీసుకొంటుండగా వెనకాల వస్తున్న కారు వారి వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. సిద్దిపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అసిఫా మృతి చెందింది.

వేర్వేరు చోట్ల ఉరేసుకుని ముగ్గురి ఆత్మహత్య

గజ్వేల్ రూరల్/మద్దూరు,/జహీరాబాద్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో వేర్వేరు చోట్ల ముగ్గురు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే అప్పుతీసుకున్న వ్యక్తి ఇవ్వనని తేల్చి చెప్పడంతో ఎంచేయాలో దిక్కుతోచక వివాహిత బుధవారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఇందుకు సంబంధించి పట్టణ ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్‌మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన గొల్లస్వప్న(34)కొంత కాలంగా జహీరాబాద్ పట్టణంలోని శేరీవెంచర్‌లో భర్తరాజు, పిల్లలతో కలిసి నివాసముంటున్నారన్నారు. స్వప్నకు భర్త రాజు గోల్డ్‌లోన్ కట్టుమని ఇటీవల రూ.4లక్షలు ఇచ్చాడు. ఆమె లోన్ కట్టకుండా గురుజువాడ గ్రామానికి చెందిన శంకర్ అనేవ్యక్తికి కొన్ని రోజుల క్రితం ఆ డబ్బును అప్పుగా ఇచ్చింది. ఇటీవల తనకు డబ్బులు ఇవ్వాలని శంకర్‌పై వత్తిడి తేవడంతో తాను ఇవ్వలేనని, నువ్వు చనిపోయినా కూడా డబ్బులు ఇవ్వనంటూ బెదిరించి తేల్చిచెప్పాడు. దీంతో ఏంచేయాలో దిక్కుతోచక ఇంట్లోఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబీకుల ఫిర్యాదుమేరకు శవానికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించి కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

గజ్వేల్ రూరల్‌లో విద్యార్థి ..

మానసిక ఒత్తిడికిలోనై పదో తరగతి విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని సంగుపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చీర్ల రాజేష్ (16)పదో తరగతి చదువుతున్నాడు. రాజేష్ తల్లిదండ్రులు కిష్టయ్య, నాగమణి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆదివారం తల్లిదండ్రులతో కలిసి అక్క వాళ్ల ఇంట్లో ఫంక్షన్‌కి వెళ్లాడు. ఫంక్షన్ అయిపోయిన తర్వాత సోమవారం ఉదయం తన తల్లిదండ్రులను ఇంటికి వెళ్తాం అని చెప్పగా అక్క ఇంట్లో ఉంటాం అని తల్లిదండ్రుల చెప్పి రాజేష్‌ని సంగుపల్లి గ్రామానికి పంపించారు. బుధవారం ఉదయం స్నేహితులు పాఠశాలకి వెళ్దామని రాజేష్ ఇంటికి వెళ్లి చూడగా మంగళవారం రాత్రి ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. తల్లిదండ్రులకు, పోలీసులు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

మద్దూరులో ఒకరు

కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గాగిల్లాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం .గ్రామానికి చెందిన ఏలూరి లక్ష్మీ రాజయ్య దంపతుల కుమారుడు ఏలూరి రామకృష్ణ (38) పేయింటర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

గంజాయి సాగు చేస్తే ప్రభుత్వ పథకాలు రద్దు

మెదక్ అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎవరైనా గంజాయి సాగు చేస్తే వారికి ప్రభుత్వ పథకాలు రద్దు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో డ్రగ్స్ వ్యతిరేక కమిటీలు వేయాలన్నారు. గ్రామ, పట్టణాల్లోని వివిధ కూడళ్లతో పాటు మెడికల్ దుకాణాలు పరిశ్రమల వద్ద తనిఖీలు చేపట్టాలన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా మెదక్‌ను తీర్చిదిద్దాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో రహదారి భద్రతా చర్యలు కీలకమైనవని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లో రోడ్డు భద్రతపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను(బ్లాక్‌స్పాట్లు)గా గుర్తించి ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. చేయూత పథకం ద్వారా అందే సామాజిక పెన్షన్లపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అంతకుముందు బాల్య వివాహాలు జరగకుండా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తయారు చేసిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు.

కార్డన్ సెర్చ్‌లతో ప్రజలకు అండ

నర్సాపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తప్పు చేసే వారితో పాటు చట్టాలను అతిక్రమించే వారికి భయం కలగడంతో పాటు మంచిగా ఉండే వారికి పోలీసులు అండగా ఉంటారని భరోసా ఇవ్వడానికే కార్డన్ సర్చ్ తరుచు నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం తెల్లవారుజామునే జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రావు ఆదేశాల మేరకు నర్సాపూర్ పట్టణంలోని చైతన్యపురి కాలనీలో డీఎస్పీ నరేందర్‌గౌడ్ నేతృత్వంలో సీఐలు జాన్‌రెడ్డి, వెంకట్రాజ్‌గౌడ్, రవిరాజ్, ఎస్సై రంజిత్‌కుమార్‌రెడ్డిలతో పాటు 77 మంది పోలీసు సిబ్బంది కాలనీలో ఇంటింటికి వెళ్లి వారి వివరాలతో పాటు వారి వద్ద ఉన్న వాహనాలకు సంబంధించిన పత్రాలు సరిగా ఉన్నాయా లేది పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్థానికులనుద్దేశించి మాట్లాడుతూ కార్డన్ సర్చ్ వల్ల ప్రజలకు తాము అండగా ఉన్నామనే భరోసా ఇవ్వడమే కాకుండా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారికి భయం కల్పించడమే ఉద్దేశమన్నారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారు ఉంటే తమకు సమాచారమివ్వాలన్నారు.

ఐదున్నర తులాల సొమ్ము అపహరణ

పాపన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అధికారులమని ఐదున్నర బంగారు సొమ్ములు దోసుకెళ్లిన ఘటన పాపన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపల్లి వంతెన వద్ద బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించి పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ అందించిన వివరాలు.. పాపన్నపేట మండల పరిధిలోని నాగసాన్పల్లి గ్రామానికి చెందిన భూసనేల్లి కిషన్ అతడి భార్య మణెమ్మ ఇరువురు కలిసి తమ బంధువుల వద్దకు ఒక విందుకోసం టేక్మాల్ మండల పరిధిలోని ఎల్లుపేట గ్రామానికి స్కూటీపై బయలుదేరారు. కొత్తపల్లి బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా బైక్‌పై వచ్చిన ఇరువురు వారిని ఆపి మేము ఆఫీసర్లమని, ఇంత నగలు వేసుకొని తిరగడం భావ్యం కాదని వారికి నచ్చ చెప్పారు. వాటిని తీసి మల్లె కట్టి డిక్కీలో వేసుకోమని చెప్పడంతో, మణెమ్మ తన మెడలో ఉన్న నాలుగు తులాల పుస్తెల తాడు , తులం నర బంగారు గుండ్లను చేతి రుమాలులో కట్టి డిక్కీలో వేశారు. ఇదే అదనుగా భావించిన దుండగులు వారిని మాటల్లో పెట్టి మైమరిపించి ఆనగలను తస్కరించి పారిపోయారు. కొద్ది దూరం వెళ్లిన బాధితులు అనుమానం వచ్చిడిక్కి తెరవగా నగలు కనిపించకపోవడంతో లబోదిబోమన్నారు, వెంటనే పాపన్నపేట పోలీస్ స్టేషన్ చేరుకొని ఫిర్యాదు చేశారు, ఈ విషయమై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

తల్లిని చంపిన కేసులో యావజ్జీవం

● సహకరించిన స్నేహితుడికి కూడా..

ములుగు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాళ్ల కడియాల కోసం కన్నతల్లిని స్నేహితుడితో కలిసి నరికి చంపిన కేసులో కొడుకుతో పాటు మరొకరికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. ఒక్కొక్కరికి రూ. 11 వేల చొప్పున జరిమానా విధిస్తూ సిద్దిపేట మొదటి అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు జడ్జి జయప్రసాద్ బుధవారం తీర్పు చెప్పారు. ములుగు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ విజయ్‌కుమార్ రికార్డులను పరిశీలించిన అనంతరం ఈ కేసు వివరాలను వెల్లడించారు. ములుగు మండలం బండమైలారం గ్రామానికి చెందిన వెంకటమ్మకు ఈశ్వర్ అనే కుమారుడు ఉన్నాడు. స్నేహితుడు రాముతో కలిసి మద్యం తాగేవాడు. 2003 ఆగస్టు 24 వెంకటమ్మను ఆమె కొడుకు ఈశ్వర్, అతడి స్నేహితుడు రాము కలిసి గొడ్డలితో నరికి చంపేశారు. కాళ్లకు ఉన్న కడియాలు దొంగలించుకుని పోయారు. ఈ మేరకు అప్పటి ములుగు ఎస్సై విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకున్నారు. అప్పటి గజ్వేల్ రూరల్ సీఐ జానకిరామ్‌రెడ్డి కేసు పరిశోధన ప్రారంభించి, సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు. బుధవారం సిద్దిపేట మొదటి అదనపు డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితులిద్దరికి శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

టెండర్ల దాఖలులో స్వల్పజోరు

మెదక్ అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాలకు టెండర్ల స్వీకరణ కొనసాగుతోంది. జిల్లాలోని 49 వైన్స్ షాపులకు వ్యాపారుల నుంచి మెదక్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 3 కౌంటర్ల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. టెండర్ల గడువు దగ్గర పడుతున్న క్రమంలో దరఖాస్తుల స్వల్పంగా పెరుగుతున్నాయి. రాబోయే రెండేళ్ల మద్యం దుకాణాల కోసం దరఖాస్తులను పెంచడానికి ఎక్సైజ్ అధికారులు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రచారంతోపాటు ఇప్పటికే మద్యం వ్యాపారం చేస్తున్న వ్యాపారులకు అవగాహన కలిగించడం వంటి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇంకా మూడు రోజుల సమయం ఉంది. చివరి రెండు రోజుల్లో భారీ స్థాయిలో టెండర్లు వచ్చేలా కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు 276 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గతంలో వచ్చిన దరఖాస్తుల కంటే ఈసారి సంఖ్య పెంచాలనే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

సరిహద్దులో అప్రమత్తంగా ఉండాలి

● సీపీ విజయ్‌కుమార్

జగదేవపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దు పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ సూచించారు. జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల సరఫరాపై ప్రత్యేక నిఘా పెంచాలన్నారు. సీపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి వచ్చిన ఆయనకు ఎస్సై కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు.

పశువులు చోరీ

కల్హేర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఫత్తేపూర్ గ్రామంలో రెండు పశువులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. చోరీ చేసిన ఈ రెండు పశువుల విలువ లక్ష రూపాయల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు.

డ్రైవర్ అదృశ్యం


చాకలి సామ్యూల్(ఫైల్)

పటాన్‌చెరు అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లి ఓ డ్రైవర్ అదృశ్యం అయిన సంఘటన బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విజయకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లాపూర్ పురపాలక పరిధి ఈదులనాగులపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న చాకలి సామ్యూల్ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లాభాల పందిరి

ఈ పద్ధతిలో పంటల సాగుతో అధిక దిగుబడులు

- మల్కాపూర్‌లో 80 శాతం మంది రైతులు ఆ వైపే మొగ్గు
- జిల్లాలోనే అత్యధికంగా తూప్రాన్ మండలంలో సాగు
- కొత్త రైతులకు 50 శాతం సబ్సిడీపై ఉద్యానశాఖ ప్రోత్సాహం
- సొర, కాకర, టమాట వంటి కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్



మల్కాపురంలో పందిరి పద్ధతిలో కాకర సాగు



తూప్రాన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూరగాయల సాగు అధికంగా ఉన్న మెదక్ జిల్లాలో రైతులను మరింత ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ కృషి చేస్తోంది. కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందేందుకు వీలుగా పందిరి సాగు పద్ధతిని ప్రోత్సహిస్తోంది. ప్రస్తుతం జిల్లాలో తక్కువగా ఉన్న పందిరి సాగును మరింత విస్తరించడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఈ పద్ధతిలో సాగు చేస్తున్న రైతులు మంచి లాభాలు ఆర్జిస్తున్నారు.

కొన్ని మండలాల్లోనే కూరగాయల సాగు

మెదక్ జిల్లాలో సాధారణంగా వానాకాలంలో సుమారు 600 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతుండగా, యాసంగిలో సుమారు 2 వేల ఎకరాల్లో రైతులు కూరగాయలు పండిస్తున్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండి, మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం అందుబాటులో ఉన్న తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, మాసాయిపేట, శివ్వంపేట, నర్సాపూర్ వంటి మండలాల్లోనే అత్యధికంగా కూరగాయల సాగు చేస్తున్నారు. మిగతా మండలాల్లో మార్కెటింగ్ సౌకర్యం తక్కువగా ఉండటం వల్ల 10 నుంచి 20 ఎకరాల్లో మాత్రమే కూరగాయలు సాగు చేస్తున్నారు. గిరిజన తాండాల్లోనూ కొంత మేర కూరగాయల సాగు చేపడుతున్నారు.

150 ఎకరాల్లో పందిరి సాగు

మెదక్ జిల్లా వ్యాప్తంగా సుమారు 150 ఎకరాల్లో పందిరి సాగు పద్ధతిలో కూరగాయల సాగు కొనసాగుతోంది. జిల్లాలో ఈ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. జిల్లాలో పందిరి సాగులో పండుతున్న కూరగాయల్లో 90 శాతం ఒక్క తూప్రాన్ మండలంలోనే సాగవుతున్నాయి. మరీ ముఖ్యంగా, 80 శాతం పందిరి సాగు తూప్రాన్ మండలం పరిధిలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంతోనే జరుగుతోంది. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ చొరవతో మల్కాపూర్‌లో పందిరి సాగు ఊపందుకుంది. 2018 ఆగస్టు 15న 'కంటి వెలుగు' పథకం ప్రారంభం కోసం మల్కాపూర్ వచ్చిన కేసీఆర్... గ్రామస్థులతో సమావేశమై రైతులకు పలు వరాలు ప్రకటించారు. ఇందులో భాగంగా, రెండు పాడి గేదెలు, పందిరి సాగుకు సహాయం ప్రకటించి అందించారు. దీనిలో భాగంగా, 90 శాతం సబ్సిడీపై పందిరి సాగుకు ప్రభుత్వం సహాయం చేయడంతో సుమారు 100 మంది రైతులు ఈ పథకాన్ని తీసుకున్నారు. మల్కాపూర్‌కు ప్రత్యేకంగా పందిరి సాగు పథకం అందించడంతో రైతులు కూరగాయలు పండించి లాభాలు పొందుతున్నారు.

లాభాలు తెస్తున్న పందిరి సాగు

తూప్రాన్ మండలంలో పందిరి సాగుతో కూరగాయల సాగు పెద్ద ఎత్తున జరుగుతోంది. పందిరి సాగుతో పాటు సాధారణ పద్ధతిలో కూడా రైతులు కూరగాయలు పండిస్తున్నారు. మల్కాపూర్‌లో సుమారు 100 మంది రైతులు పందిరి సాగు ద్వారా కూరగాయల పంటలు పండిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇక్కడ రైతులు ప్రధానంగా సొర, కాకర, బీర, టమాట పంటలను పండిస్తున్నారు. పందిరి సాగుతో కూరగాయలు నాణ్యంగా ఉండటంతో పాటు దెబ్బతినకుండా ఉంటాయి. నేలపై సాగు చేసే వాటి కంటే మెరుగైన నాణ్యత, దెబ్బతినకుండా ఉండటం వల్ల మార్కెట్‌లో వీటికి మంచి డిమాండ్ లభిస్తోంది. మొన్నటి వరకు వర్షాల కారణంగా సాధారణ కూరగాయల పంటలు దెబ్బతిన్నప్పటికీ, పందిరి సాగు తోటల్లో మాత్రం కొంతమేరకు మెరుగ్గా ఉన్నాయి. నాణ్యమైన కూరగాయలు పండుతుండటం వల్ల రిలయన్స్ వంటి సంస్థలు కూడా కొనుగోలుకు మొగ్గు చూపుతున్నాయి. మల్కాపూర్‌లో పందిరి సాగు చేస్తున్న రైతులు అధికంగా రిలయన్స్ సంస్థకే తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు.

పందిరి సాగుతో నాణ్యమైన దిగుబడి



పందిరి సాగుతో నాణ్యమైన కూరగాయలు పండుతున్నాయి. నాణ్యత ఉండటంతో మంచి ధరలకు అమ్ముడుపోతున్నాయి. మల్కాపూర్ రైతులు పందిరి సాగులో కూరగాయలు పండించి లాభాలు పొందుతున్నారు. మొన్నటి వరకు ధరలు లేక ఇబ్బందులు వచ్చాయి. ప్రస్తుతం రేటు పెరుగుతుండటంతో రైతులకు లాభాలు వస్తున్నాయి. పందిరి సాగుతో పండిన కూరగాయలకు డిమాండ్ అధికంగా ఉంటుంది.

\- రఘుపతి, మల్కాపూర్ రైతు

50 శాతం సబ్సిడీకి అవకాశం



జిల్లాలో పందిరి సాగు ఏర్పాటు చేసుకోవడానికి రైతులకు ఉద్యానశాఖ సబ్సిడీతో పథకాన్ని అందజేస్తుంది. ఎకరాకు 50 శాతం సబ్సిడీతో రూ. లక్ష వరకు సబ్సిడీ లభిస్తుంది. రైతులు మార్చి వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. రైతులు ముందుకు వచ్చి పందిరి సాగుతో కూరగాయల సాగు చేపట్టాలి. పందిరి సాగుతో నాణ్యమైన కూరగాయల దిగుబడి వస్తుంది. రైతులు పథకం పొందడానికి ముందుకు వచ్చి ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి.

\-అర్చన, తూప్రాన్ డివిజన్ ఉద్యానశాఖ అధికారి



తరుణ్‌ను అభినందిస్తున్న గీతా స్కూల్ యాజమాన్యం

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



లోకేష్, అభిలాష్



వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపికైన బోరంచ విద్యార్థినులు

పాపన్నపేట/అల్లాదుర్గం/మనూరు/తూప్రాన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరులో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో పలువురు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాపన్నపేట జూనియర్ కళాశాలకు చెందిన లోకేష్, అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన పాంపాటి అబిలాష్ ఎంపికయ్యారు. అదేవిధంగా సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీల్లో తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థి పెంజర్ల తరుణ్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు గీతా స్కూల్ ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్ తెలిపారు. తరుణ్‌ను బుధవారం పాఠశాల కరస్పాండెంట్ పి. రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి. ఉష, డైరెక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణగుప్తా, భరత్, డాక్టర్ మౌనిక, ప్రిన్సిపాల్ ప్రేమ్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ వజ్ర రాజేశ్వర్ అభినందించారు. ఈ నెల 16, 17 తేదీల్లో పటాన్‌చెరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఇక రాష్ట్ర స్థాయి అండర్-14 (బాలికల) వాలీబాల్ టోర్నమెంట్‌కు బోరంచ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అఫ్రబేగం, భవాని, విజయ పారిచారి ఎంపికయ్యారు. ఈ నెల 18న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నారు.

రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు..

వెల్దుర్తి, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలకు వెల్దుర్తి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సదాల లిఖిత ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సాంబయ్య అన్నారు. బుధవారం మెదక్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 200 మీటర్ల పరుగు పందెం పోటీలో పాఠశాలకు చెందిన సదాల లిఖిత పాల్గొని ప్రతిభను కనబరిచి రెండవ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థిని లిఖితను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

'గీతం'లో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు

పటాన్‌చెరు రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గీతం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని అప్లైడ్ సైకాలజీ విభాగం నిర్వహిస్తున్న ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ నెల 16 వరకు జరుగనున్న ఈ కార్యక్రమంలో భాగంగా మనస్తత్వ శాస్త్ర విద్యార్థులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బుధవారం జరిగిన ఉత్సవాల్లో కన్సల్టెంట్ సైకియాట్రిస్ట్, డాన్ హెల్తీ మైండ్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ దల్జీత్ కౌర్ ప్రసంగించారు. మానసిక ఆరోగ్యం గురించి చర్చించడంలో ఎలాంటి దాపరికం లేకుండా వ్యవహరించడం, సహాయం కోరడానికి సంకోచించకూడదనే ప్రజా అవగాహన ప్రయత్నాలు ముడిపడి ఉన్నాయన్నారు.

నేటి నుంచి పటాన్‌చెరులో క్రీడా సంబురాలు

- మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి పోటీలు
- హాజరుకానున్న 420 మంది క్రీడాకారులు
- ఏర్పాట్లు పూర్తి చేశాం : ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పట్టణం మైత్రి మైదానంలో గురువారం నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్, కబడ్డీ క్రీడా పోటీలు మైత్రి మైదానంలో జరగనున్నాయి. ఈ పోటీలకు 33 జిల్లాలకు చెందిన 420 మంది క్రీడాకారులు, 60 మంది శిక్షకులు, 160 మంది వ్యాయామ ఉపాధ్యాయులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ తొలిసారి పటాన్‌చెరులో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు జరగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. క్రీడలకు అవసరమైన ట్రోఫీలు, వసతి, భోజనం వంటి సౌకర్యాలను తన సొంత నిధులతో సమకూరుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి విజేతలు జాతీయస్థాయికి ఎంపికైనప్పుడు ఆయా రాష్ట్రాలకు వెళ్లి ఆడటానికి కావాల్సిన ఆర్థిక సహాయాన్ని కూడా అందించనున్నట్లు తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, ఉపాధ్యాయులు, సంరక్షకులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని తెలిపారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



క్రీడలకు సిద్ధమైన పటాన్‌చెరులోని మైత్రి మైదానం

ఐపీఎస్ అధికారి ఆత్మహత్యపై కేంద్రం మౌనం దురదృష్టకరం : మంత్రి పొన్నం



హుస్నాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దళిత ఐపీఎస్ అధికారి పురాన్ కుమార్ ఉన్నతాధికారుల వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకుని వారం రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దళితుల పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి ఇది స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. బుధవారం హుస్నాబాద్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. పురాన్ తన ఆత్మహత్యకు కారణమైన ఎనిమిది మంది అధికారుల పేర్లను లేఖలో స్పష్టంగా రాసినప్పటికీ, కంటి తుడుపు చర్యగా డీజీపీని మాత్రమే తొలగించారని మంత్రి మండిపడ్డారు. పురాన్ మృతదేహాన్ని మార్చురీలో ఉంచి ఆయన భార్య, సీనియర్ ఐఏఎస్ అధికారిణి అమ్నీత్ వారం రోజులుగా న్యాయం కోసం పోరాడుతున్నా కేంద్రం మాత్రం వివక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. అలాగే, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎన్ని కుట్రలు చేసినా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని పొన్నం ప్రభాకర్ దీమా వ్యక్తం చేశారు. చిత్తశుద్ధి ఉంటే జూబ్లీహిల్స్ అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. రాజకీయ లబ్ధి కోసమే కేటీఆర్, హరీశ్‌రావు తమ పార్టీ అభ్యర్థి సునీతతో కన్నీరు కార్పిస్తూ ఎన్నికల ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు.

కేతకీ ఆలయంలో జడ్జి పూజలు



జడ్జికి స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఝరాసంగం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీకేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతురావు పాటిల్, ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఈవో శివరుద్రప్ప పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని దివాలా తీసేలా కేంద్రం విధానాలు

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్



సదస్సులో సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగాన్ని దివాలా తీసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని, వాటిపై నిరంతర పోరాటాలు నిర్వహిస్తామని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శోభన్ అన్నారు. బుధవారం సిద్దిపేటలో పత్తి రైతుల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. సుంకాలకు తలవంచితే వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది రైతులు 46 లక్షల ఎకరాలలో పత్తి పండిస్తున్నారని తెలిపారు. రైతులకు న్యాయం జరిగే విధంగా కేంద్ర ప్రభుత్వం చొరవ చూపి పత్తి కొనుగోలు కేంద్రాలను తెరవాలని డిమాండ్ చేశారు. అనంతరం పత్తి రైతుల సిద్దిపేట జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్, రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దేవేందర్ రెడ్డి, మల్లారెడ్డి, ఆంజనేయులు, ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'సింగూరు' గేట్లు మూసివేత

తగ్గిన వరద ఉధృతి.. రెండు నెలల తరువాత క్రస్ట్ గేట్లు క్లోజ్

- ప్రమాద హెచ్చరికలతో 16.624 టీఎంసీలకే నీటి నిల్వ పరిమితం
- డ్యామ్ పటిష్టం అయ్యే వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం
- ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 3,171 క్యూసెక్కులుగా నమోదు



గేట్లు మూసేసిన సింగూరు ప్రాజెక్టు

పుల్‌కల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టింది. ఎగువన కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లో మంజీర నది పరీవాహక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద వచ్చి చేరిన విషయం తెలిసిందే. గత నాలుగైదు రోజులుగా వరద ప్రవాహం తగ్గడంతో, దాదాపు రెండు నెలల పాటు తెరిచి ఉంచిన క్రస్ట్‌గేట్లను నీటి పారుదల శాఖ ఇంజనీరింగ్ అధికారులు మూసివేశారు.ప్రాజెక్టు చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా దాదాపుగా లక్షకు పైగా క్యూసెక్కుల వరద వచ్చి చేరడంతో దిగువన లోతట్టు గ్రామాల్లో ఆందోళన నెలకొంది. ఈ ఏడాది వేసవికాలంలో రాష్ట్ర ఆనకట్ట భద్రత కమిటీ ప్రాజెక్టును పరిశీలించింది. ప్రాజెక్టు కుడి వైపున అంతర్భాగంలో రాతి తెట్టె కుంగిపోయిన ప్రాంతాన్ని గమనించి, ప్రాజెక్టు పరిస్థితి బాగా లేదని, 16 టీఎంసీలకు మించి నీటి నిల్వలు చేస్తే ప్రమాదం పొంచి ఉందని ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో ప్రాజెక్టు అధికారులు ఆ నివేదిక మేరకు నీటి నిల్వలు చేస్తూ, ఎగువ నుంచి వచ్చిన వరదను వచ్చినట్లుగానే దిగువకు వదిలారు. ఈ సీజన్‌లో అత్యధికంగా 243 టీఎంసీల నీటిని దిగువకు వదలడం గమనార్హం. దాదాపు రెండు నెలల పాటు మంజీర నది నిండు ప్రవాహంతో కళకళలాడింది. మొత్తం 17 క్రస్ట్ గేట్లకు గాను 11 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తూ అధికారులు ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

నీటి నిల్వల్లో కోత

రాష్ట్ర ఆనకట్ట భద్రత కమిటీ నివేదిక దృష్ట్యా, ప్రాజెక్టు ఆనకట్టను పటిష్టం చేసేంత వరకు నీటి నిల్వలు పరిమితంగానే చేయనున్నారు. ప్రాజెక్టుకు కుడి వైపున అంతర్భాగంలో ఆనకట్టకు అమర్చిన రాతి తెట్టె దాదాపు 300 మీటర్ల దూరం వరకు కుంగిపోయింది. ఇది రెండేళ్ల క్రితమే జరిగినప్పటికీ, ఈ ఏడాది కమిటీ పరిశీలనతో లోపాలు వెలుగుచూశాయి. వచ్చే వేసవికాలం నాటికి నీటి నిల్వలు తగ్గిన అనంతరం ఆనకట్ట పటిష్టతకు శాశ్వత చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు (520.600 మీటర్లు) కాగా, బుధవారం రాత్రికి 16.624 టీఎంసీలు (520.520 మీటర్లు) నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 3,171 క్యూసెక్కులుగా నమోదైంది. జల విద్యుత్ ఉత్పత్తి గేటు ద్వారా 2511 క్యూసెక్కులు, సింగూరు ప్రధాన ఎడమ కాలువకు 120 క్యూసెక్కులు, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు 80, మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు విడుదల చేయగా, 390 క్యూసెక్కులు ఆవిరి అవుతోంది.



ట్రైజ్రియో టెక్నాలజీస్ ప్రతినిధులు అశోక్ వేములపల్లి కుటుంబసభ్యులతో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి, ప్రొఫెసర్లు

ఐఐటీహెచ్‌కు ట్రైజ్రియో టెక్నాలజీస్ సహకారం

కంది, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో అధునాతన సాంకేతికతతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసేందుకు ట్రైజ్రియో టెక్నాలజీస్ సంస్థ సహకారం అందించింది. ఈ మేరకు ఐఐటీహెచ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలోని ఒక ఫ్లోర్‌కు బుధవారం ఆ సంస్థ ప్రతినిధులు దాత అశోక్ వేములపల్లి పేరు పెట్టారు. ఐఐటీ హైదరాబాద్‌లో ఆవిష్కరణలకు స్ఫూర్తినిస్తూ చేసిన ఈ పరివర్తనాత్మక సహకారం... భవిష్యత్తు కోసం ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థలను పెంపొందించడానికి విద్య, పరిశ్రమల మధ్య ఉమ్మడి దృక్పథాన్ని సూచిస్తుందని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు. ఈ చర్య ద్వారా ఐఐటీహెచ్‌లో సాంకేతిక నైపుణ్యం, పరిశోధనలు అభివృద్ధి చెందుతాయని బీఎస్ మూర్తి తెలిపారు.

260 కిలోల ఎండు గంజాయి పట్టివేత

- రూ.17,500 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం
- నలుగురిపై కేసు

మునిపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒడిస్సా నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. మునిపల్లి ఎస్ఐ రాజేష్ నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద ఎత్తున గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ రాజేష్ నాయక్, ఎస్-న్యాబ్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్ రావు సిబ్బందితో వాహనాలను తనిఖీ చేశారు. కారు, బొలెరో వాహనాలను తనిఖీ చేయగా అందులో 130 ప్యాకెట్లలో 260 కిలోల ఎండు గంజాయి లభించింది. దీంతో నిందితులు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన పిటారా పరిచ్చా, దేవిడ్‌పాశ్, ధరంచంద్ పైక్, సంజీవ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. సరఫరాదారుడు రాజ్ కుమార్ సూచన మేరకు గంజాయిని ఒడిస్సా రాష్ట్రం గంజామ్ జిల్లా చంద్రగిరి నుంచి మహారాష్ట్రలోని మాలెగావ్ ప్రాంతానికి తరలించి విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి గంజాయితోపాటు రెండు వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.17,500 నగదు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.1.30కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎస్ఐ రాజేష్ నాయక్, ఎస్ న్యాబ్ నాగేశ్వర్ రావు, క్లూస్ టీం సిబ్బందిని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించారు.



పోలీసుల అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

న్యూస్ బాక్స్

నేడు గజ్వేల్‌లో వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణ

గజ్వేల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లారెడ్డి గార్డెన్స్‌లో ఈ నెల 16 న వేలూరు ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు గజ్వేల్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి, రచయిత పులి రాజు రచించిన ఈ పుస్తకాన్ని మల్లారెడ్డి గార్డెన్స్‌లో ఆవిష్కరించనున్నామన్నారు. వేలూరు గ్రామంలో 20ఏళ్లలో 51మంది ఆత్మహత్య చేసుకుంటే 44మంది రైతులే ఉన్నారని, ఈ ఆత్మహత్యలను చూసి చలించిన పులిరాజు పుస్తక రూపంలో ఆత్మహత్యల గోస పుస్తకావిష్కరణకు పూనుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో రచయిత పులిరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లికార్జున్, కనకయ్య, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు అహ్మద్, ఉమర్, గంగిశెట్టి నర్సింలు, కళాధర్, సాధక్ పాషా తదితరులున్నారు.

18న బీసీ జేఏసీ బంద్‌ను విజయవంతం చేయాలి

హుస్నాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 18న 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు బీసీ జేఏసీ ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలని హుస్నాబాద్ బీసీ ఐక్య వేదిక కో ఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ కోరారు. బుధవారం హుస్నాబాద్‌లోని విశ్రాంత ఉద్యోగ సంఘం భవనంలో జరిగి బీసీ ఐక్య వేదిక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీసీ ఐక్య వేదిక కో ఆర్డినేటర్‌గా వీరన్న యాదవ్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్రంలో బీసీ జేఏసీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితిల ఆధ్వర్యంలో జరిగే ఉద్యమాలను విజయవంతం చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిత్తారి రవీందర్, కొయ్యడ కొంరయ్య, వివిధ పార్టీలు, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సులో గ్రామీణ మహిళల పాత్ర అపూర్వం

గజ్వేల్/గజ్వేల్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు, అభివృద్ధికి గ్రామీణ మహిళల పాత్ర అపూర్వమైనదని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణుతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళా అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రణాళికలు రూపొందించి ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లమ్మ, అనిత, లక్ష్మి, మల్లవ్వ, యాదమ్మ తదితరులున్నారు.

లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలి

మిరుదొడ్డి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గెజిటెట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మిరుదొడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గెజిటెడ్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి జీఎల్ఏటీ రాజీలేని పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జీఎల్ఏటీ జిల్లా అధ్యక్షుడు రమేష్ రెడ్డి, సభ్యులు వంశీ, నవీన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి జీవితంలో స్థిరపడాలి

కొండపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నప్పటి నుంచే కష్టపడి చదివి జీవితంలో తలెత్తుకునేలా స్థిరపడాలని కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ అన్నారు. కొండపాక ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలే మంచి స్నేహితులుగా భావించాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాల గురించి, షీ టీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి, షీ టీమ్ ద్వారా ఎలా రక్షణ పొందొచ్చు అనే అంశాలను వివరించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, గజ్వేల్, కుకునూరుపల్లి ఏఎస్ఐలు సువర్ణ, శ్రీరాములు, షీటీమ్ బృందం, కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి తదితరులున్నారు.

మృతుడి కుటుంబానికి అండగా..

గజ్వేల్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మృతుని కుటుంబానికి అండగా ఉంటామని బీజేపీ బూత్ అధ్యక్షుడు గుండారం నవీన్ అన్నారు. మంగళవారం రిమ్మన గూడ గ్రామానికి చెందిన పంజాల నాగుల్‌గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం గుండారం నవీన్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సహాయం అందజేశారు. వెంట పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు ఉన్నారు.

ధాన్యాన్ని ఆరబెట్టేందుకు అపసోపాలు తప్పవా?

- కొన్నేళ్లుగా సబ్సిడీపై అందని టార్పాలిన్లు
- వర్షం వస్తే ధాన్యం కాపాడుకునేందుకు ఆగమవుతున్న రైతన్నలు
- వ్యాపారుల వద్ద కొనుగోలు చేద్దామంటే రూ.2,500 నుంచి రూ.3వేల వరకు వెచ్చించాల్సిందే
- సబ్సిడీపై టార్పాలిన్ కవర్లను అందించాలని రైతుల వేడుకోలు



మహ్మదాపూర్‌లో వర్షం కురుస్తుందేమోననే భయంతో ధాన్యం కుప్పచేస్తున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటను ఆరబెట్టుకునే సమయంలో వర్షం నుంచి ధాన్యాన్ని కాపాడుకోవడానికి ఆరేడేళ్ల క్రితం వరకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించేది. అనంతరం ఈ పథకం నిలిచిపోవడంతో ధాన్యం ఆరబోసుకున్న రైతులు టార్పాలిన్లు లేక అనేక నష్టాలపాలవుతున్నారు. వరి కోతల సమయంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, వర్షాల బారీ నుంచి ధాన్యం కాపాడుకోవడం కోసం రాత్రింబవళ్లు కంటి మీద కునుకు లేకుండా కాపాలాకాస్తున్నారు. కొందరు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో టార్పాలిన్లను అద్దెకు తెచ్చుకుని ఆర్థికంగా నష్టాలపాలవుతున్నారు.

కొందరికే తూతూమంత్రంగా..

జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 3.55లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా రైతులకు అవసరమైన టార్పాలిన్లు ప్రభుత్వం అందించలేక పోతోంది. మార్కెట్ యార్డుల్లో ధాన్యం ఆరబోసినప్పుడు వర్షం వచ్చిన సమయంలో మాత్రమే కొందరు రైతులకు ఆధార్ కార్డు ఆధారంగా టార్పాలిన్లు అందిస్తున్నా, అవి పూర్తిస్థాయిలో రైతులకు అందించడం లేదనే ఆరోపణలున్నాయి. కొందరికి మాత్రమే తూతూ మంత్రంగా ఇచ్చి చేతులు దులుపుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

రైతుల అవసరం.. వ్యాపారులకు అవకాశం..!

గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా మార్కెట్ యార్డు ద్వారా రైతులకు ఆధార్‌కార్డు ఆధారంగా టార్పాలిన్ కవర్లు ఇచ్చేవారు. ధాన్యం విక్రయించిన తర్వాత వాటిని మార్కెట్ అధికారులకు వాపస్ చేసేవారు. కాని ప్రస్తుతం ఇచ్చే పరిస్థితి లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు రైతులు అద్దెపై టార్పాలిన్ కవర్లను తీసుకునేందుకు దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. రైతులు ధాన్యం కాపాడు కోవడం కోసం ఎక్కువ ధరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యాపారులు రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని టార్పాలిన్లకు ధరలు పెంచి అమ్ముతున్నా కొనుగోలు చేయక తప్పడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ధాన్యం ఆరబోసుకోవడం కోసం సబ్సిడీపై రైతులకు టార్పాలిన్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వాలి



గతంలో ప్రభుత్వం నాణ్యమైన కవర్లను 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించేది. గత ఆరు, ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఇవ్వడం లేదు. దీంతో వర్షం వస్తే ధాన్యం తడిసిపోతుంది. మళ్లీ ధాన్యం ఆరబెట్టాలంటే అనేక అవస్థలు పడుతున్నాం. ప్రభుత్వం సబ్సిడీపై పరదాలు అందించాలి.

\- మూగయ్య, రైతు

ఒక్కో కవర్‌కు రూ. వేలు వెచ్చిస్తున్నాం

వర్షం బారి నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు దుకాణాల్లో టార్పాలిన్లను కొనుగోలు చేయాలంటే రూ. 2,500 నుంచి రూ.3 వేల వరకు ఖర్చు అవుతుంది. దీంతో పంట దిగుబడి కంటే కవర్ల కొనుగోలుకు ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లను అందజేయాలి

\- రాజయ్య, రైతు

ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనుల పరిశీలన

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ పరిశీలించారు. దీనికి ముందు పట్టణంలోని డీఆర్‌సీసీ, కంపోస్ట్ షెడ్‌లను పరిశీలించి చెత్త విభజనకు సంబంధించి అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు. పట్టణంలోని బెజ్జంకి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులున్నారు.



ఎల్లమ్మ చెరువు పనులను పరిశీలిస్తున్న గరిమా అగ్రవాల్

రేపటిలోగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి



తొగుట మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

తొగుట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను రేపటిలోగా ప్రభుత్వం ప్రారంభించక పోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని బీఆర్ఎస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం తొగుట మార్కెట్ యార్డులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మొక్కజొన్నలకు మద్దతు ధర లేక దళారుల పాలవుతున్నా, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం సిగ్గుచేటన్నారు. వరి సన్నధాన్యంకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించి ఇవ్వకపోవడం రైతులను ధోకా చేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ సమీర్ అహ్మద్ ఖాన్, మార్కెట్ కమిటీ కార్యదర్శి స్వామి, కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ యాదగిరి, ఐకేపీ ఏపీఎం బాబురావు, బీఆర్ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

- **దౌల్తాబాద్:** మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మడి నరసింహ రెడ్డి తల్లి ఇటీవలే మృతి చెందింది. ఇటీవలే తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త జనగామ వెంకటయ్య కుమారుడు దయాకర్ పాము కాటుతో మృతి చెందాడు. బుధవారం బాధిత కుటుంబాలకు చెందిన దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి నరసింహారెడ్డిని,తిర్మలాపూర్ వెంకటయ్య ను అదే గ్రామానికి చెందిన బాలరాజును దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట దుబ్బాక నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త రణం శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు ఎ సయ్యద్ రహీముద్దీన్, తిరుమలాపూర్ మాజీ ఎంపీటీసీ దేవేందర్, నాయకులు గడ్డం నాగరాజు,ఎల్లం, సత్తయ్య, తదితరులు ఉన్నారు.

ప్రధానోపాధ్యాయురాలి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి



తొగుటలో సభ్యత్వ నమోదు ప్రారంభించి మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతి రెడ్డి

తొగుట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేదని ఆరోపిస్తూ బద్దిపడిగ ప్రధానోపాధ్యాయురాలు పద్మను కలెక్టర్ సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి తెలిపారు. వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం తొగుట మండలంలోని బండారుపల్లి, పెద్దమాసాన్‌పల్లి, ఎల్లారెడ్డిపేట, ఘనపూర్, గుడికందుల, కాన్గల్, తొగుట, జప్తిలింగారెడ్డిపల్లి, లింగాపూర్, వెంకట్రావ్‌పేట, చందాపూర్ తదితర పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు సంబంధించిన వేతనాలు, బిల్లులు నాలుగు నెలల నుంచి పెండింగ్‌లో ఉండడంతో పాటు బిల్లులు చెల్లించకపోవడం వల్లనే భోజనంలో నాణ్యత లోపిస్తుందన్నారు. పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులకు పర్యవేక్షణ అధికారం మాత్రమే ఉందనీ పూర్తి బాధ్యత లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు 8 నెలల నుంచి వేతనాలు రావడం లేదని, వెంటనే జిల్లా కలెక్టర్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ జానకి రాములు, జిల్లా కార్యదర్శి శివాజీ, మండల అధ్యక్షుడు రాములు, నాయకులు పాల్గొన్నారు.

- **సిద్దిపేట కల్చరల్:** బద్దిపడగ హైస్కూల్ హెడ్మాస్టర్ పద్మను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని సిద్దిపేట సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు చేగూరి దేవరాజ్, ప్రధాన కార్యదర్శి శశి యాదవ్ అన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు కొద్ది నెలలుగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఎన్నో వ్యయప్రయాసలకు ఓరుస్తూ విధులు నిర్వహిస్తున్న హెచ్ఎంను కలెక్టర్ సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. హెడ్మాస్టర్ సస్పెన్షన్‌ను వెనక్కు తీసుకుని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖాజీపూర్‌లో తల్లిపాలవారోత్సవం

మిరుదొడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు



తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



ఆసుపత్రి వద్ద ఆస్కీ బృందంతో బీజేపీ నాయకులు

హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆస్కీ బృందం

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల్లో ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర చికిత్సనందించేందుకు నేషనల్ ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటులో భాగంగా బుధవారం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని డాక్టర్ పూర్ణిమ నేతృత్వంలో ఆస్కీ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా) బృందం సందర్శించింది. ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది, పరికరాలను పరిశీలించి ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి ద్వారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ట్రామా కేర్ సెంటర్ కోసం తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. బీజేపీ నాయకులు పరిశీలన బృందాన్ని కలసి మారుమూల ప్రాంతమైన హుస్నాబాద్‌లో ట్రామా కేర్ సెంటర్‌ను అందుబాటులో తీసుకవచ్చి సేవలు అందించే విధంగా నివేదికను అందించాలని కోరారు. ఇందులో బీజేపీ నాయకులు దొడ్డి శ్రీనివాస్, లక్ష్మణ్ తదితరులున్నారు.


రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చింతమడక విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో కొత్త రాజిరెడ్డి

సిద్దిపేట రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మెదక్‌లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో సిద్దిపేట రూరల్ మండలం చింతమడక విద్యార్థులు ఎనిమిది మంది రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈవో కొత్త రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం పాఠశాలలో అభినందించారు. రాష్ట్ర స్థాయికి ప్రత్యేక విజతలుగా అండర్ 17 బాలికల విభాగంలో నిఖిత-3000 మీటర్ల రేస్ వాక్‌లో బంగారు పతకం, డి. రుక్సిత- ట్రిపుల్ జంప్‌లో బంగారు పతకం, లాంగ్ జంప్‌లో వెండి పతకం, బి. అర్చన- ట్రిపుల్ జంప్‌లో వెండి పతకం సాధించారు. అండర్ 14 బాలికలు విభాగంలో పి. గీతికా- హై జంప్‌లో వెండి పతకం, 80 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకం, ఆర్. శ్రీనిక- 80 మీటర్ల హర్డిల్స్‌లో వెండి పతకం, జి. శ్రీనిక- డిస్కస్ త్రోలో కాంస్య పతకం సాధించారు. అండర్ -14 బాలుర విభాగంలో యశ్వంత్ -80 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం, అండర్ -17 బాలుర విభాగంలో రాము-100 మీటర్ల పరుగులో వెండి పతకం సాధించినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ఫిజికల్ డైరెక్టర్ వెంకటస్వామి అభినందించారు.

వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి..



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

రాయపోల్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ క్రీడలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 14న గజ్వేల్‌లో జరిగిన జోనల్‌స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో రాయపోల్ విద్యార్థులు యశ్వంత్, సౌమ్య ఎంపికయ్యారు. అండర్ 19 విభాగంలో సంగారెడ్డిలో వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు సంజన ఎంపికైంది. విద్యార్థులను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పీడీ గోవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 33 మందికి జరిమానా

సిద్దిపేటక్రైం/గజ్వేల్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 33 మందిని బుధవారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా న్యాయాధికారులు వారికి మొత్తం రూ. 39,100 జరిమానాగా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుల్లో ఒకరికి జైలుశిక్ష విధించారు. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 14 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కుమారి వి. తరణి, ముందు హాజరుపరచగా విచారణ అనంతరం రూ. 11,100 జరిమానా విధించారు. వారిలో ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారని సీఐ తెలిపారు. అదేవిధంగా గజ్వేల్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 19 మంది పట్టుబడినట్టు ట్రాఫిక్ సీఐ మురళి వెల్లడించారు. వారిని గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం రూ.28 వేలు జరిమానా విధించినట్టు తెలిపారు.

కలాం జీవితం అందరికీ ఆదర్శం



భూంపల్లి పాఠశాలలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్/మిరుదొడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న అబ్దుల్ కలాం జయంతి వేడుకలు సిద్దిపేటలోని మెరిడియన్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంబటి మహేందర్ మాట్లాడుతూ.. కలాం ఒక సామాన్య కుటుంబంలో పుట్టి భారత రాష్ట్రపతిగా ఎదిగిన ఆయన ప్రస్థానాన్ని మనందరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ బృందంతో కలిసి అబ్దుల్ కలాం చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించునిఆయన చిత్రపటానికి పూలమాలను వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, బాలకృష్ణ, రాజేశ్వరీ, వాలింటర్లు సరితా, నవితా తదితరులున్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి



మామిడాలలో శిక్షణలో మాట్లాడుతున్న పీడీ జయదేవ్

ములుగు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలందరూ శిక్షణ తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా డీఆర్డీఏ పీడీ జయదేవ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మామిడాల గ్రామంలో అలీఫ్ ఐకేపీ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా పీడీ జయదేవ్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలందరూ కుట్టు మిషన్‌తో పాటు ఇతర ఎలాంటి శిక్షణనైనా ఇప్పిస్తామని, దీంతో సొంతంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో మేరీ స్వర్ణకుమారి డీపీఎం విద్యాసాగర్ ఏటీఎం ఆనంద్ ఆలీ సంస్థ కాసిం. పాటు భాగ్యలక్ష్మి, వీవోలు విజయలక్ష్మి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ తరగతులతో ఉత్తమ ఫలితాలు

దౌల్తాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులతో వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో గజ్జల కనకరాజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదోతరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణను మండల విద్యాధికారి గజ్జల కనకరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో విద్యార్థులతో మాట్లాడుతూ. వార్షిక పరీక్షల గురించి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, సంజీవ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి సీఆర్పీ రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

గజ్వేల్ రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రానున్న మునిసిపల్ ఎన్నికల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో బీజేపీ జెండా ఎగురవేయాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. బుధవారం బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్ యాదవ్, ఇతర నాయకులు ఎంపీ రఘునందన్ రావును ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు, గజ్వేల్‌లో బీజేపీ అభివృద్ధిపై, పలు ప్రజా సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, సిద్దిపేట జిల్లా బీజేపీ కౌన్సిల్ సభ్యుడు చేప్యాల వెంకటరెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ ప్రధాన కార్యదర్శి నాయిని సందీప్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.


పర్యావరణ సంరక్షణపై ఎన్ఎస్ఎస్ అవగాహన

వర్గల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండల కేంద్రంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి అంబేడ్కర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం బుధవారం మూడో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా గ్రామంలో ఆరోగ్య పరిరక్షణ, పర్యావరణ సంరక్షణ, పరిశుభ్రత, విద్య ప్రాధాన్యత, మహిళా సాధికారత వంటి అంశాలపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరుగుతూ గ్రామస్థులతో ఏకమై వారి అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న నూనె, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జంగం పాండు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు 45 మంది పాల్గొన్నారు.

మల్టీ.. పల్టీ..!

(7వ పేజీ తరువాయి)

పెట్టినవారు జిల్లాలో పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. రైతుల నుంచి మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు కూడా పోటీపడి ఆ కంపెనీకి డబ్బులు జమచేశారంటే అతిశయోక్తి కాదు. ఈ డబ్బులను ఎలక్ట్రానిక్ వస్తువుల పెట్టుబడి కోసం వినియోగిస్తారని, తద్వారా వచ్చే లాభాన్ని అందరికీ పంచుతారని ప్రచారం చేశారు. అంతేగాకుండా, సదరు యాప్‌లో వీరు డిపాజిట్ చేసిన డబ్బుల మొత్తం పెరుగుతున్నట్లుగా చూపించడంతో మరింత మంది ఆసక్తి కనబరిచారు. ఓ ప్రముఖ బ్యాంకు పేరిట ఉన్న నకిలీ సర్టిఫికెట్‌ను సైతం వాడుకున్నారు.



How the LG-LF scam works

Scammers are leveraging the reputation of legitimate companies to deceive victims, and in this case, they are using the names of major corporations LG and LF. Key features of the scam include:

- **Fake investment platform:** The scheme involves an app that claims to allow users to "invest" in LG-manufactured devices to earn dividends and high returns.
- **Recruitment pyramid scheme:** Users are incentivized to recruit others to earn more, a hallmark of a pyramid scheme.
- **Unauthorized use of company names:** The scammers falsely claim partnerships with reputable organizations like LG Electronics, the government, and ICICI Bank to appear legitimate. LG Soft India has issued public warnings about fake job offers using their name and logo.
- **Upfront payment for jobs:** Legitimately,

ఎల్ఎఫ్ వర్క్, మల్టీలెవల్ కంపెనీ పేరిట ప్రచారంలో ఉన్న వివరాలు

చితికిపోతున్న కుటుంబాలు

ఇలాంటి బోగస్ యాప్‌లు, ఆన్‌లైన్ బెట్టింగ్ దందాలతో జిల్లాలో అనేక కుటుంబాలు వీధిన పడ్డాయి. బెట్టింగ్ ముసుగులో ప్రాణాలు కోల్పోయిన వారు ఉన్నారు. ఈజీమనీకి అలవాటు పడి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టినవారు, పెట్టిన డబ్బు తిరిగి రాక మనోవేదనకు గురవుతున్నారు. ఇటీవల వర్గల్ మండలంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. దీనికి కారణమైన నిందితులనుఎస్సీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్ దందాలపై ఆయన హెచ్చరికలు జారీ చేశారు.